నమస్తే తెలంగాణ
నిజామాబాద్, ఆదివారం 4 ఆగస్టు 2024
SUNDAY, AUGUST 4, 2024

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వల్లభాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 3 : జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలు, తల్లిపాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కల్పించారు. పిల్లలకు 6 నెలలు వచ్చే వరకు తల్లిపాలే పట్టాలని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

కోటగిరి మండలం వల్లభాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత, రుద్రూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రూప, పొతంగల్ మండలం జల్లాపల్లి ఆబాది అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి అవగాహన కల్పించారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి, కోరట్‌పల్లి, ఖిల్లా డిచ్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ధర్పల్లి మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సిరికొండ మండలం న్యావనంది, పెద్దవాల్గోట్‌లోని కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో డిచ్‌పల్లి సీడీపీవో ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి స్వర్ణలత తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

మోర్తాడ్, ఏర్గట్ల, రెంజల్, మాక్లూర్ మండలాలతోపాటు బోధన్ పట్టణంలోని 13వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మోర్తాడ్ మండలం వడ్యాట్‌లో ఏసీడీపీవో జ్ఞానేశ్వరీ పాల్గొని మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డలకు అమృతం లాంటివని పేర్కొన్నారు. ఏర్గట్ల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో తయారుచేసిన వంటలను వడ్డించారు. బోధన్ పట్టణంలోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రాధికా రాథోడ్ ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. రెంజల్‌మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో పుట్టిన ఆరు, ఏడు మాసాల చిన్నారులకు అన్న ప్రాసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మాక్లూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

7న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత నిర్ధారణ శిబిరం

ఖలీల్‌వాడి, ఆగస్టు 3 : దివ్యాంగ విద్యార్థులకు ఉచిత నిర్ధారణ శిబిరాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకాలనీ (కేసీఆర్ కాలనీ)లో ఉన్న ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేసేందుకు ఉచిత నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న 18 ఏండ్లలోపు పిల్లలను శిబిరానికి తీసుకురావాలని సూచించారు.

13 నుంచి బీఎడ్ పరీక్షలు

డిచ్‌పల్లి, ఆగస్టు 3 : టీయూ పరిధిలోని బీఎడ్ 4వ సెమిస్టర్, రెగ్యులర్ 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈనెల 13 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

టీయూ టీమ్ స్పిరిట్ ఈవెంట్

బహుమతులతో విద్యార్థులు

డిచ్‌పల్లి, ఆగస్టు 3 : టీయూలోని మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఐఎంబీఏ విద్యార్థులు టీమ్ స్పిరిట్ గేమ్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు మైండ్ గేమ్స్ ఆడారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఆంజనేయులు హాజరై ఈవెంట్ మేనేజర్లు కొటూరి శ్వేత, మోతె, వేల్పూర్ రసజ్ఞ, మెగావత్ లావణ్యను అభినందించారు. విజేతలుగా సాయికుమార్, వినీల, భాగ్యశ్రీ, దుష్యంత్ నిలిచారు.

ఆపరేషన్ ముస్కాన్ -Xలో 74 మంది పిల్లల గుర్తింపు

వినాయక్‌నగర్, ఆగస్టు 3 : నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో జూన్ 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ – Xలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో –74 మంది పిల్లలను గుర్తించామని సీపీ కల్మేశ్వర్ శనివారం వెల్లడించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో చిన్నారులను పనిలో పెట్టుకున్న వారిపై 5 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు. తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పన్ యాప్‌లో నమోదు చేశామని చెప్పారు. నిజామాబాద్ సబ్‌డివిజన్ పరిధిలో–26, ఆర్మూర్ సబ్‌డివిజన్ పరిధిలో–15, బోధన్ సబ్‌డివిజన్ పరిధిలో–33 మంది పిల్లలను గుర్తించినట్లు వివరించారు.

నాగారం శివారులో చిరుత

వినాయక్‌నగర్, ఆగస్టు 3 : నగర శివారులోని నాగారం డంపింగ్ యార్డ్ ప్రాంతం వెనుక ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్‌లో శనివారం సాయంత్రం చిరుత కనిపించింది. ఓ పెద్ద రాయిపై చిరుత కూర్చొని ఉండడాన్ని చూసిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. నిజామాబాద్ నార్త్ ఎఫ్ఆర్వో సంజయ్ గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. నాగారం శివారు ప్రాంత ప్రజలు, పశువుల, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటికి వెళ్లవద్దని సూచించారు.

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన గంగపుత్ర నాయకులు

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గంగపుత్ర నాయకులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 3 : హైదరాబాద్‌లోని మత్స్యభవన్‌లో జిల్లా గంగపుత్ర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను జిల్లా గంగపుత్ర నాయకులు శనివారం కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయాలని, అర్సపల్లిలోని మత్స్యశాఖ కార్యాలయం వద్ద హోల్‌సేల్ చేపల మార్కెట్ నిర్మాణానికి టెండర్లు పిలువాలని, చెరువులపై పూర్తి హక్కులు గంగపుత్రులకే ఉండేలా చూడాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గంగపుత్ర అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బాలగంగాధర్, గౌరవ అధ్యక్షుడు బట్టు నరేందర్, లీగల్ అడ్వైజర్ దుబ్బాక రవికుమార్, నాయకులు కోరట్‌పల్లి ఆనంద్, మాడవేడి వినోద్‌కుమార్, సుధీర్, సాయిలు, పెద్దన్న, లింగం, గంగాధర్, బాలయ్య, పోతన్న పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ట్రాఫిక్ పాయింట్ వద్ద అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఓ మహిళ పర్సు శుక్రవారం దొరికింది. ఏఎస్సై రాజు, బీబీఎస్ రాజు, సిబ్బంది స్వామి, శేఖర్, ఫయాజ్ పర్సును పరిశీలించగా.. రూ.10 వేల నగదుతో పాటు ఎల్ఐసీ బాండ్లు, విలువైన పత్రాలు తదితర వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ వెంకటనారాయణకు తెలుపగా.. సదరు మహిళ మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన మంజులగా గుర్తించి శనివారం పర్సును అందజేశారు.
– వినాయక్‌నగర్, ఆగస్టు 3

రేపు 'ప్రజావాణి' రద్దు

కంఠేశ్వర్, ఆగస్టు 3 : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీన రద్దు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సి ఉన్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న 'ప్రజావాణి' ఉంటుందని స్పష్టం చేశారు.

యామినీ కృష్ణమూర్తి మృతికి సంతాపం

సుభాష్‌నగర్, ఆగస్టు 3 : భరతనాట్యం, కూచిపూడి కళాకారిణి యామినీకృష్ణమూర్తి మరణం కళారంగానికి తీరని లోటు అని ప్రముఖ కవి వీపీ చందన్ రావు అన్నారు. తెలంగాణ గాయత్రీ ధార్మిక వేదిక ఇందూరు ఆధ్వర్యంలో గీతాభవన్‌లో ఆమె చిత్రపటానికి శనివారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె దేశ విదేశాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చి, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా సేవలందించారని కొనియాడారు.

బాధ్యతల స్వీకరణ

నవీపేట, ఆగస్టు 3: నవీపేట మండల పంచాయతీరాజ్ ఏఈగా జుబేర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు నవీపేట ఏఈగా పనిచేసిన శ్రావణ్‌కుమార్ నిజామాబాద్ రూరల్‌కు బదిలీపై వెళ్లగా, బాన్సువాడ ఏఈగా పనిచేసిన జుబేర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో నాగనాథ్ తెలిపారు.

నూతన చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన

వినాయక్‌నగర్, ఆగస్టు 3 : రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన నూతన చట్టాలపై నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సన్హిహిత–2023, భారతీయ సాక్ష అధినియం –2023, భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత–2023 చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మహ్మద్ రహీముద్దీన్, భూసారపు రాజేశ్ గౌడ్ పోలీస్ అధికారులు, ఇతర శాఖల సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, రాజారెడ్డి, బంటు వసంత్, నిజామాబాద్ డివిజన్ పోలీసు, ఫారెస్టు, ఎక్సైజ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీజ్ వేడుకలు ప్రారంభం

సుభాష్‌నగర్, ఆగస్టు 3 : జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ పాలిటెక్నిక్ మైదానంలో తీజ్ వేడుకలను శనివారం రాత్రి సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించే వేడుకల్లో భాగంగా మొదటిరోజు తీజ్ బోయేరో కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీమాతతో పాటు బుట్టల్లో గోధుమలు వేసి పూజలు నిర్వహించారు. తీజ్ వేడుకల కమిటీ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ చాంగుబాయి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ మోతీలాల్, డాక్టర్ సులోచనరాణి, డాక్టర్ హరికృష్ణ, రాంచందర్‌నాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్. మూర్తి

డిచ్‌పల్లి, ఆగస్టు 3 : యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్లను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్. మూర్తి అన్నారు. టీయూలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ జోక్యం లేకుండా వీసీలను నియమించాలన్నారు. యూనివర్సిటీల్లో సరైన వసతులు కల్పించడం, నిధులు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. టీయూలో అభివృద్ధి పనులకు రూ. 200 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ మమత డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్, జిల్లా సహాయ కార్యదర్శి దీపిక, యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షులు దినేశ్, లక్ష్మణ్, సాయి పాల్గొన్నారు.

నేడు టీటీసీ థియరీ పరీక్షలు

ఖలీల్‌వాడి, ఆగస్టు 3 : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ థియరీ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. www.bse. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలు ఆదివారం ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని పేర్కొన్నారు.

అటవీభూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు

ఇందల్వాయి, ఆగస్టు 3 : అటవీభూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్ భట్ హెచ్చరించారు. ఇందల్వాయి మండలం గౌరారం శివారులోని 425 బీట్ పరిధిలో ఉన్న అటవీభూమిని పలువురు ఆక్రమించి పొలం వేసిన విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి.. ఘటనాస్థలాన్ని సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. అటవీ భూమిలో అక్రమంగా పొలం వేసిన వారిని విచారించారు. ప్రభుత్వం ఇచ్చిన పోడుభూముల హద్దులు దాటి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గేదెలు, పశువులను ఫారెస్ట్ భూమిలో మేపేందుకు పలువురు వెళ్లనివ్వడం లేదని గౌరారం గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. అడ్డుకోవద్దని ఎఫ్ఆర్వో సూచించారు.

ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, ఆగస్టు 3 : ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్లు – 8, అసోసియేట్ ప్రొఫెసర్లు –9, అసిస్టెంట్ ప్రొఫెసర్లు –14, ట్యూటర్–3, జూనియర్ రెసిడెంట్ –18, అసిస్టెంట్ సర్జన్ –10 పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 14న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలి -** కోటగిరి, ఆగస్టు 3 : గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలని ఎంపీవో చందర్ సూచించారు. మండలంలోని రాంపూర్, సుద్దులం, సుద్దులం తండాలో పరిశుభ్రత, మురికి కాలువలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు హన్మంత్‌రావు, కవిత, ఈశ్వర్ ఉన్నారు.
- **పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలి -** కోటగిరి, ఆగస్టు 3 : కోటగిరి సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలను అందజేస్తున్నామని, ఎకరానికి రూ. 54 వేలు చొప్పున సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు కూచి సిద్ధు సూచించారు. శనివారం పలువురు రైతులకు పంటరుణాల చెక్కులను అందజేశారు. మొదటి విడుతలో 26 మంది రైతులకు రూ.11,84,200 లక్షల రుణం ఇచ్చామని తెలిపారు.
- **'వయనాడ్' బాధితుల కోసం విరాళాల సేకరణ–** రుద్రూర్/బోధన్, ఆగస్టు 3 : కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం రుద్రూర్, వర్నిలో సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో శనివారం విరాళాల సేకరణ చేపట్టారు. విరాళాలను బాధితులకు పంపనున్నట్లు చెప్పారు. నాయకులు సాయిబాబా, లక్ష్మణ్ పాల్గొన్నారు.
- **మున్సిపల్ కార్మికుల సమస్యలపై 6న ధర్నా -** కంఠేశ్వర్, ఆగస్టు 3 : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఈనెల 6వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు మున్సిపల్ యూనియన్ నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. జిల్లాకేంద్రంలో శనివారం కార్మికులతో మాటాలడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.
- **ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నాం -** ఖలీల్‌వాడి, ఆగస్టు 3 : కొన్ని నెలలుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఖండిస్తున్నామని వామపక్షాలు జిల్లాకేంద్రంలో శనివారం నిరసన తెలిపాయి. యుద్ధాన్ని విరమించాలని అనేక దేశాలు సూచిస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం ఇజ్రాయెల్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- **మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత –** రుద్రూర్, ఆగస్టు 3 : మండలంలోని రాయకూర్ గ్రామశివారు నుంచి మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను తహసీల్దార్ వెంకటేశం శనివారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తహసీల్దార్.. సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్‌ను పట్టుకొని, రుద్రూర్ పోలీసులకు అప్పగించారు.
- **సంజీవ్‌కుమార్‌కు నివాళి:** మోర్తాడ్, ఆగస్టు 3: ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ అకాల మరణం అందరికీ తీరనిలోటని అధికారులు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల ప్రత్యేకాధికారి సాయగౌడ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఏపీవో విద్యానంద్, అరవింద్, మారుతి పాల్గొన్నారు.
- **చట్టాలపై పోలీసులకు అవగాహన:** శక్కర్‌నగర్, ఆగస్టు 3: బోధన్ పట్టణంలోని న్యాయస్థానంలో పోలీసులకు పలు చట్టాలపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణితో పాటు అడిషనల్ పీపీలు శనివారం అవగాహన కల్పించారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ న్యాయసంహిత తదితర చట్టాల గురించి వివరించారు.
- **ముగిసిన నవచండీయాగం:** బోధన్, ఆగస్టు 3: పట్టణంలో మారుతీ మందిరం అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవచండీ హోమం శనివారం ముగిసింది.
- **స్థల పరిశీలన:** శక్కర్‌నగర్, ఆగస్టు 3: బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోకు చెందిన స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి శనివారం స్థలాన్ని పరిశీలించారు.
- **కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు:** నవీపేట,ఆగస్టు 3: అబ్బాపూర్ (ఎం)లో నాసిరకం రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన నీరడి కళ్యాణ్.. ఎంపీడీవో నాగనాథ్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. మరమ్మతులు చేపట్టని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తానని కల్యాణ్ పేర్కొన్నాడు.
- **పొలం బాట:** రెంజల్, ఆగస్టు 3 : మండల శివారులో శనివారం రైతుపొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎడపల్లి ఏడీఏ బెనర్జీ, రెంజల్ ఏఈ రాజలింగం తెలిపారు. ఏడీఈ మాట్లాడుతూ... వ్యవసాయయేతర వాడే విద్యుత్తును రైతులు ఆదా చేయాలని సూచించారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ:** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 3: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ ఈ నెల 9 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి దేవారాం తెలిపారు. ఈ మేరకు పట్టణంలో స్థానిక నాయకులతో కలిసి పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.
- **దత్తాపూర్‌లో కేవీకే శాస్త్రవేత్తల బృందం:** నందిపేట్, ఆగస్టు 3: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలో రుద్రూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం శనివారం పర్యటించింది. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సోయాచిక్కుడు, మక్కజొన్న, వరి, ఆయిల్‌పామ్ తదితర పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు.
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం:** ముప్కాల్, ఆగస్టు 3 : మండల కేంద్రానికి చెందిన దోమకొండ బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబానికి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ కిషన్ శనివారం రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

జీవన భృతి పెంచి ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 3: బీడీ కార్మికులకు జీవనభృతిని పెంచి వెంటనే ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకుడు ముత్తెన్న మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 4,016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దొంగ మాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డికి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.

బాలుర వసతిగృహానికి టేబుల్ ఫ్యాన్ల వితరణ

శక్కర్‌నగర్, ఆగస్టు 3: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థుల కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ వారిచే మూడు టేబుల్ ఫ్యాన్లను శనివారం బహూకరించారు. కొత్తపల్లి శ్రీకాంత్, నవత దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సుబ్బారావు, కార్యదర్శి పోశెట్టి, కోశాధికారి కె. శ్రీకాంత్, జోన్ చైర్మన్ కె. కవిత, మంజూష, వెంకట లక్ష్మి, గోపాలకృష్ణ, మేరి, వసతి గృహ సంక్షేమ అధికారి ఎ.నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేత

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 3: పట్టణంలోని పెర్కిట్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సీసీ కెమెరాలను శనివారం వితరణంగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో క్యారం ర్యాంకింగ్ టోర్నీ

భీమ్‌గల్,ఆగస్టు 3: పట్టణంలో రాష్ట్రస్థాయి క్యారం ర్యాంకింగ్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. మాజీ క్రీడాకారుడు మందుల హన్మాండ్లు స్మారకార్థం ఈ పోటీలను రాష్ట్ర క్యారం అసోషియేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఏఎస్పీ బస్వారెడ్డి,క్యారం అసోషియేషన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వరల్డ్ నంబర్‌వన్ క్రీడాకారుడు శ్రీనివాస్ హాజరయ్యారు.

'స్వచ్ఛ దనం - పచ్చదనం' విజయవంతం చేయాలి

బోధన్‌లో మాట్లాడుతున్న డీపీవో తరుణ్‌కుమార్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం–పచ్చదనంపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆర్మూర్, నందిపేట్, మోర్తాడ్, మాక్లూర్, బాల్కొండ, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి తదితర మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు గ్రామ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించారు. స్వచ్ఛదనం–పచ్చదనంపై పలు సూచనలు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంపై డీసీవో శ్రీనివాస్ అవగాహన కల్పించారు.స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ఐదురోజులపాటు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిసనర్ మకరంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రోజువారి కార్యక్రమాల వివరాలు

5వ తేదీ: డివిజన్‌ల వారి స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించుట
6వ తేదీ: తాగునీరు–వర్షపు నీరు సంరక్షణ
7వ తేదీ: కాలువలు,నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలు పూడ్చుట
8వ తేదీ: ఆరోగ్యం,వీధి కుక్కల బెడదపై దృష్టి పెట్టడం
9వ తేదీ: ప్రభుత్వ సంస్థలు–ప్రభుత్వ స్థలాలను శుభ్రపరచడం..

సాటాపూర్‌లో వివాహిత ఆత్మహత్య

రెంజల్, ఆగస్టు 3: మండలంలోని సాటాపూర్ గ్రామంలో బొంబాయి శైలజ (30) పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్‌కు చెందిన సంజీవ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య శైలజకు సంతానం లేకపోవడంతో 2013లో నిజామాబాద్‌కు చెందిన ఇందుతో రెండో వివాహం చేసుకున్నాడు.కొన్నాళ్లకు శైలజ.. భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేయగా..ప్రతినెలా రూ. 3వేలు ఇవ్వాలని రాజీ కుదుర్చారు. ప్రతినెల మాదిరిగా ఈ నెల 2న వెయ్యి రూపాయలు ఇవ్వగా..మిగతా రెండు వేల కోసం శైలజ కందకుర్తిలో ఉన్న భర్త సంజీవ్ వద్ద వెళ్లి నిలదీసింది. ఇవ్వకుంటే చనిపోతానంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగింది. గమనించి భర్త వెంటనే ఆమెకు నీళ్లు తాగించి కక్కించి తిరిగి పంపించాడు. అక్కడి నుంచి శైలజ తన కూతురుతో కలిసి బట్టిలో కల్లు తాగి సాటాపూర్‌కు వెళ్లి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. శైలజ అన్న గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యం చేరుకోవాలి

రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 3: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాలులో శనివారం చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం విద్యాస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో దుర్గా ప్రసాద్, ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పార్థసారథి

జాతీయస్థాయిలో సత్తాచాటిన అయిలాపూర్ విద్యార్థి

నందిపేట్, ఆగస్టు 3 : మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గోనే మణిప్రసాద్ అనే విద్యార్థి ఆలిండియా ఆయూష్ హోమియో విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జాతీయస్థాయిలో 38వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గత నెల 6న హైదరాబాద్‌లో పరీక్ష నిర్వహించగా.. హోమియో విభాగంలో సత్తా చాటడంతో కుటుంబీకులు, మిత్రులు అభినందించారు.

పెర్కిట్ విండోకు నోటీసులు జారీ

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు 3: పట్టణంలోని పెర్కిట్ సొసైటీకి డబ్బుల రికవరీ కోసం బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ.. పెర్కిట్ సొసైటీలో కార్యదర్శిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన గౌస్ మోహినుద్దీన్‌కు పాత విధానం ప్రకారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 8లక్షలకు పైగా ఇచ్చినట్లు తెలిపారు. కొత్తగా హెచ్ఆర్ పాలసీ వచ్చిన తర్వాత బ్యాంకు అధికారులు లెక్కచూసి రూ. లక్షా 85 వేలు అదనంగా అందాయని, తిరిగి చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

బోధన్, ఆగస్టు 3: పట్టణంలోని 13వ వార్డులో సమస్య లు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం ఆర్టీవో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. బోధన్ నుంచి తమ కాలనీకి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని, వర్షాలకు బురద నిండిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏసోబు, కృష్ణయ్య, యాదగిరి గౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, రమణ, విజయ్, రమేశ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 3: పట్టణంలోని 31వ వార్డులో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉన్నదని, డ్రైనేజీ సమస్య ఉన్నదని పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు వడ్లూరి సుమన్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం

రుద్రూర్/ జక్రాన్‌పల్లి/ మోర్తాడ్/శక్కర్‌నగర్/ రెంజల్, ఆగస్టు 3 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో గ్రామస్తులు బస్టాండ్ వద్ద ప్రధానమంత్రి మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జక్రాన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మోర్తాడ్‌లో ఎమ్మార్పీ ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జేటి లక్ష్మీపతి ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లో సంబురాలు చేసుకొన్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బోధన్‌లో ఎమ్మార్పీఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు తాడెం అబ్బయ్య ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రెంజల్ మం డలం నీలా గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, అంబేద్కర్ విగ్రహం వద్ద పటాకులు కాల్చి సంబురాలు చేసుకొన్నారు. మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిం చారు.

తిమ్మాపూర్ గ్రామంలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

ప్లాట్స్ అమ్మబడును
★నిజామాబాద్ మారుతినగర్ వెనుక, న్యూ హౌసింగ్ బోర్డ్ ఎదురుగా, లే అవుట్ ఈస్ట్ ఫేస్ 312 గజాలు మరియు వెస్ట్ ఫేస్ 306 గజాల గల 2 ప్లాట్లు అమ్మబడును. సెల్: 94937 11066
NTZ-340178

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-All

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు రూ.- మాత్రమే
GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.